# సాక్షి తిరుపతి

శుక్రవారం । 22 । మార్చి । 2024






**ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు**

ఎన్నికల సమయంలో గారడీ చేస్తున్న ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని ఎంపీ గురుమూర్తి ప్రజలకు సూచించారు. - IIలో



**రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు**

చిల్లకూరు మండలం, కలవకొండ గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. - IIలో

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ శుక్రవారం(సా) | సహర్ శనివారం(ఉ) |
|---|---|---|
| తిరుపతి | 6-27 | 4-56 |
| గూడూరు | 6-22 | 4-52 |

## న్యూస్‌రీల్

### ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం



టీటీడీ ఈఓకు విరాళం డీడీని అందిస్తున్న దాత రాఘవేంద్ర

**తిరుపతి(అలిపిరి):** బెంగళూరుకు చెందిన అగర్వాల్ ఇండెక్స్ పర్సస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం అందించింది. ఈ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర విరాళం డీడీని తిరుపతిలోని పరిపాలనా భవనంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి అందించారు.

### నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో అమ్మవారు

**నారాయణవనం:** మండలంలో టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారు ఊంజల్‌సేవలో ఊయలూగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సుప్రభాత సేవతో నిత్యపూజాకైంకర్యాలను పూర్తిచేసి నైవేద్యం సమర్పించారు. పద్మావతీ అమ్మవారికి సర్కారు అభిషేకాన్ని నిర్వహించారు. సాయంత్రం నిత్య పూజల అనంతరం అమ్మవారిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధపుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండలంలో ఊయలపై కొలువుదీరారు. వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఉయ్యాల సేవ కనుల పండువగా కొనసాగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్‌లు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శిగా కుమార్



**తిరుపతి మంగళం:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి చెందిన సలవాది కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమనకరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని కుమార్ స్పష్టం చేశారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీ అభ్యున్నతికి, తిరుపతిలో అభినయ్‌రెడ్డి, గురుమూర్తి గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

### శ్రీవారి దర్శనానికి 16 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 69,072 మంది స్వామివారిని దర్శించుకోగా 26,239 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.51 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### డక్కిలిలో పోలీస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

**డక్కిలి:** మండలంలోని ఆల్తూరుపాడు, దగ్గవోలు, పాతనాలపాడు (కమ్మవారిపల్లి) గ్రామాల్లో కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు గురువారం ప్రజా చైతన్యం కల్పిస్తూ పోలీస్ కవాతు నిర్వహించారు. సీఐ సంగమేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఎన్నికల విధులకు ఆటంకం కల్పించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సీట్ల చిచ్చు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన స్థానిక నేతల్లో చిచ్చు రాజేసింది. రోజురోజుకీ అసమ్మతి రాగం సెగలు పుట్టిస్తోంది. అభ్యర్థుల ప్రకటన నిర్ణయాన్ని మరోసారి పునరాలోచించాలన్న నినాదం మిన్నంటుతోంది. అసమ్మతి నేతలంతా రహస్య సమావేశాలు.. ఎత్తుకుపైఎత్తులు వేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. బొజ్జలకు సహకరించేది లేదని శ్రీకాళహస్తి నేతలు భీష్మించుకోగా.. టికెట్ కమలనాథులదేనని అక్కడి నేతలు ప్రకటించుకోవడం ఆసక్తికరంగా మారింది. తిరుపతిలో లోకల్ నాన్ లోకల్ వివాదం తెరపైకి రాగా.. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అభ్యర్థనను చినబాబు తిరస్కరించి ఛీవాట్లు పెట్టడం ఇప్పుడు ఇక్కడ హాట్‌టాపిక్‌గా మారింది. సత్యవేడులో రెబల్ అభ్యర్థుల ప్రచారం నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రచారం చేయొద్దంటూ లోకేష్ ఆదేశించడం ఆయన వర్గీయులను విస్మయానికి గురిచేసింది. వెంకటగిరిలో టీడీపీకి సహకరించేది లేదని మస్తాన్ యాదవ్ వర్గం ప్రకటించడం ఎమ్మెల్యే అభ్యర్థి నోట్లో వెలక్కాయపడ్డట్టయ్యింది.

- శ్రీకాళహస్తిలో బొజ్జల వద్దేవద్దంటున్న కూటమి నేతలు
- తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు లోకేష్ వార్నింగ్
- నాగబాబు వద్దకు చేరిన తిరుపతి జనసేన నేతల పంచాయితీ
- వెంకటగిరిలో చంద్రబాబు నిర్ణయంపై భగ్గుమంటున్న బీసీ నేతలు
- సత్యవేడులో ఆదిమూలానికి షాక్.. కొన్నాళ్లు ప్రచారం చేయొద్దన్న లోకేష్



**సాక్షి, తిరుపతి:** కూటమిలో సీట్లు చిచ్చు రాజుకుంది. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఆశావహుల ధిక్కారస్వరం శ్రుతి మించుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబుకు తన సొంత జిల్లాలో అసమ్మతి సెగ పెద్ద సవాలుగా మారింది. పొత్తులో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరిలో ఆయా అభ్యర్థులను బాహాటకంగా స్థానిక నేతలు వ్యతిరేకిస్తున్నారు. తిరుపతి అసెంబ్లీ సీటుని ఉమ్మడి అభ్యర్థి జనసేనకు కేటాయించగా.. మిగిలిన నియోజకవర్గాల్లో టీడీపీ పోటీ చేస్తోంది.

**సత్యవేడు..ప్రచారానికి మోకాలడ్డు!**

సత్యవేడులో అభ్యర్థి ఆదిమూలాన్ని మార్చకపోతే తాము సహకరించేది లేదని టీడీపీ నేతల ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. టీడీపీ నాయకుడు జేడీ రాజశేఖర్ రెబల్ అభ్యర్థిగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో తిరుపతికి వచ్చిన లోకేష్‌ని ఆదిమూలం కలిశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్నాళ్ల పాటు ఎటువంటి ప్రచారాలు చేయొద్దంటూ లోకేష్ ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. లోకేష్ మాటలతో షాక్‌కి గురైన ఆదిమూలం తన అనుచరులతో సమావేశమైనట్లు తెలిసింది. టీడీపీ నేతల సమాచారం మేరకు.. మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య అధిష్టానంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నేటి నుంచి సత్యవేడులో అభ్యర్థుల ఎంపికపై రీసర్వే చేపట్టనున్నట్లు సమాచారం. మరో వైపు మాజీ ఎమ్మెల్యే హేమలత చంద్రబాబు తీరుపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

**వెంకటగిరి..యాదవ అనుచరులదే మరి!**

వెంకటగిరిలో టీడీపీ నాయకుడు మస్తాన్ యాదవ్ అనుచరులు చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థికి సహకరించేది లేదని మరోసారి ప్రకటించారు. ఆ మేరకు మస్తాన్ యాదవ్ అనుచరులు సమావేశంలో చర్చించి అధిష్టానానికి తమ నిర్ణయాన్ని పంపించారు.

**ఇది 'సుగుణ'ం కాదు..**

తిరుపతి స్థానిక నాయకులు లోకల్ నాన్ లోకల్ ఫీలింగ్ తీసుకురావడంతో చిచ్చు మరింతగా రాజుకుంది. తిరుమల దర్శనార్థం వచ్చిన లోకేష్ ఎదుట తిరుపతి టీడీపీ నేతలు తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. అభ్యర్థిని మార్చే ప్రశక్తే లేదని తేల్చిచెప్పడంతో పాటు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు వార్నింగ్ కూడా ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. 'మీరు ఎన్ని డ్రామాలు చేస్తున్నా.. అధిష్టానం అన్నీ గమనిస్తూనే ఉంది' అంటూ హెచ్చరికలు జారీ చేసి టీడీపీ శ్రేణులను తీవ్రంగా అవమానించారు. ఇదిలా ఉంటే.. తిరుపతిలో 50 డివిజన్ల అధ్యక్షులను మార్చాలంటూ జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పట్టుబడుతున్నారు. తాను అభ్యర్థి అయినప్పుడు తనకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుంటానని స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే స్థానిక జనసేన నాయకులు కిరణ్‌రాయల్, మరికొందరు ఆరణి శ్రీనివాసులు నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. దీంతో తిరుపతి పంచాయితీ గురువారం రాత్రి నాగబాబు వద్దకు చేరింది.

### బొజ్జల వద్దేవద్దు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, జనసేన ఇన్‌చార్జ్ వినుత, బీజేపీ నేతలు కలిసి గురువారం రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. అధిష్టానం ఒంటెద్దు పోకడలకుపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బొజ్జల సుధీర్‌కి ఇస్తే పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో చివరి దశలో ఉన్న తనకు అవకాశం ఇవ్వాలని, కమ్మ సామాజికవర్గానికి న్యాయం చేయాలని ఎస్సీవీ నాయుడు అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఎవరికి వారు రెబల్ అభ్యర్థులుగా బరిలో ఉంటామని హెచ్చరిస్తున్నారు. మరోవైపు శ్రీకాళహస్తి టికెట్ బీజేపీకి కేటాయించాలని కమలనాథులు చంద్రబాబుపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా కోలా ఆనంద్ గత కొద్దిరోజులుగా ఢిల్లీకే పరిమితమయ్యారు.



శ్రీకాళహస్తిలో సమావేశమైన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

### మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- నేడు సత్యవేడు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన
- ఏడు మండలాల్లో భారీ బహిరంగ సభలు
- ఏర్పాట్లలో తలమునకలైన పార్టీ శ్రేణులు



కేవీబీపురంలో పార్టీ నేతలతో మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

**వరదయ్యపాళెం/పిచ్చాటూరు:** రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి శుక్రవారం సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ తెలిపారు. ఉదయం 9గంటలకు నారాయణవనం సొరకాయలస్వామి కల్యాణ మండపం, 10.30కు కేవీబీపురంలోని అంబేడ్కర్ విగ్రహం సర్కిల్ వద్ద, 12 గంటలకు పిచ్చాటూరులోని పీడబ్ల్యూటీ గ్రౌండ్ వద్ద, మధ్యాహ్నం ఒంటి గంటకు నాగలాపురంలోని టీవీఆర్‌ఆర్ కల్యాణ మండపం, 3 గంటలకు సత్యవేడులోని బేరిశెట్టి కల్యాణ మండపం వద్ద, సాయంత్రం 4 గంటలకు వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద, 5.30 గంటలకు బీఎన్‌కండ్రిగలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో జరిగే భారీ బహిరంగ సభల్లో వారు పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. ఆ మేరకు అన్ని మండలాల్లో ఏర్పాట్లను పార్టీ శ్రేణులు పర్యవేక్షిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా మంత్రి పర్యటన జరగనుంది.

# కలసికట్టుగా ఎన్నికల ప్రక్రియ

- హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదవండి
- ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభించాలి
- ఈవీఎం సమస్యలుంటే సెక్టోరియల్ అధికారికి తెలియజేయండి
- పీఓ, ఏపీఓల శిక్షణలో కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి



తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో తిరుపతి నియోజకవర్గానికి చెందిన పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

**తిరుపతి అర్బన్:** కలసికట్టుగా సార్వత్రిక ఎన్నిల ప్రక్రియ పూర్తిచేద్దామని కలెక్టర్ జీ.లక్ష్మీశ పిలుపునిచ్చారు. పీఓలు, ఏపీఓలకు జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వాహణపై గురువారం శిక్షణ ఇచ్చారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో తిరుపతి నియోజవర్గ పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ రెండు నియోజకవర్గాలను కలెక్టర్ పరిశీలించారు. కచ్చిపి ఆడిటోరియంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణలో అనుభవం ఉన్నప్పటికీ ప్రతిసారీ కొత్తగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు భావించాలన్నారు. అంతేతప్ప అనుభవం ఉందని నిబంధనలను చూడకుంటా ఉంటే సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సారి ఎన్నికల కమిషన్ ఆదేశాల్లో పలు కొత్త అంశాలను జోడించారని చెప్పారు. ఆ మేరకు హ్యాండ్‌బుక్‌లో ఎన్నికల నిబంధనలు స్పష్టంగా ఉన్నాయనిన్నారు. ఎన్నికల నిర్వాహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. పీఓలకు చెందిన డైరీలో ఎప్పటికప్పుడు అన్ని అంశాలను నమోదు చేయాలని వివరించారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మే 13న ఉదయం 5.30 నుంచి 6.45 గంటల వరకు మాక్‌పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం 7 గంటల నుంచి ఓటర్లకు వీలుగా పోలింగ్ ప్రారంభించాలని వెల్లడించారు. 17(సి)ని రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో సమస్యలుంటే వెంటనే సెక్టార్ అధికారికి, రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని చెప్పారు. ఏమైనా ఈవీఎంలకు సంబంధించి సమస్యలుంటే సెక్టోరియల్ అధికారికి తెలియజేయాలని సూచించారు. అధికారులకు మరోసారి శిక్షణ ఉంటుందని చెప్పారు. పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలతోపాటు ఇతర పోలింగ్ సామగ్రిని తీసుకుని వెళ్లి, ఓటింగ్ అనంతరం తిరిగి రిసెప్షన్ కేంద్రంలో వాటిని అప్పగించే వరకు బాధ్యతగా ప్రవరించాలన్నారు. సమిష్టిగా ఎన్నికలను విజయవంతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి ఈఆర్‌ఓ అదితిసింగ్ మాట్లాడుతూ పూర్తి అవగాహనతో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అంతా కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ జీఎం స్మార్ట్ సిటీ తిరుపతి చంద్రమౌళి, ఎస్టీసీ మురళి పోలింగ్ నిర్వహణ, టెండర్ ఓట్, చాలెంజింగ్ ఓట్ తదితర అంశాలను వివరించారు. పలు ఫార్మాట్లపై ఆన్ హ్యాండ్ శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నోడల్ అధికారులు ప్రతాప్‌రెడ్డి, బాలకొండయ్యతోపాటు పీఓలు, ఏపీఓలు హాజరయ్యారు.

**ప్రతి అంశాన్నీ నమోదు చేయండి**

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రం నుంచి రాజకీయ అంశాలతో పాటు వ్యాపార ప్రకటనలకు చెందిన అన్ని అంశాలను నమోదు చేయాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెంటర్‌తోపాటు కంట్రోల్ రూం, హెల్ప్ డెస్క్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా శిక్షణ ఇన్‌చార్జ్‌లకు పలు సూచనలు చేశారు. చిన్న విషయాలను సైతం నమోదు చేయాలని చెప్పారు. ప్రతి ఉద్యోగి క్రమంతప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య, తిరుపతి డివిజన్ అధికారి ఈశ్వరమ్మ తదితరులున్నారు.


### • కృష్ణ కటాక్షం



తెప్పోత్సవంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి

తిరుమలలో శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు అయిన గురువారం స్వామివారు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి అలంకరణలో తెప్పపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. స్వామివా, అమ్మవార్లను భక్తులు తనివితీరా చూసి తరించారు. ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– తిరుమల



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

# బావ.. బావమరిది సవాల్!

- పరసా, నెలవల మధ్య విభేదాలు
- ఆసక్తిగా గమనిస్తున్న స్థానికులు

**సూళ్లూరుపేట:** సూళ్లూరుపేటకు చెందిన పరసా వెంకటరత్నయ్య, నెలవల సుబ్రమణ్యం వరుసకు బావ, బామ్మర్దులు. టీడీపీ అధినేత మెప్పు పొంది పరసారత్నం గతంలో ఆరు సార్లు టికెట్లు తెచ్చుకుని, అందులో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత పార్టీలో లోకేష్ జోక్యం పెరగడంతో పరసారత్నయ్యను పక్కన పెడుతూవచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నెలవల సుబ్రమణ్యంకు బాధ్యతలు అప్పగించి బావబామ్మర్ది మధ్య కోల్డ్ వార్‌కు కారణమయ్యారు. ఇప్పుడు ఇది చాలదన్నట్టు తన కుమార్తె జయశ్రీకి టికెట్టు ఇప్పించుకుని, కనీసం ప్రచారానికి కూడా పిలవకుండా పరసారత్నయ్యను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన వర్గీయులు రగిలిపోతున్నారు.



నెలవల సుబ్రమణ్యం, పరసా వెంకటరత్నయ్య

**అసలు కథేంటంటే?**

సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ కంచుకోటను వైఎస్సార్‌సీపీ బద్దలుకొట్టి 2014లో పాగా వేసింది. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు కిలివేటి సంజీవయ్య ఎమ్మెల్యేగా విజయఢంకా మోగించారు. అయితే సుదీర్ఘ కాలంగా పరసా వెంకటరత్నయ్య ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ 1994, 1999 ఎన్నికల్లో గెలిచారు. ఆ తరువాత 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నెలవల సుబ్రమణ్యం చేతిలో ఓడిపోయారు. 2009లో పరసా గెలిచినప్పటికీ ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కొనసాగారు. 1994 నుంచి 2019 దాకా ఆరుసార్లు జరిగిన సాధారణ ఎన్నికల్లో ఒక్క సారి నెలవల చేతిలో, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య చేతిలో రెండు సార్లు వరుసగా ఓటమిపాలయ్యారు. 2019లో అయితే డిపాజిట్ కూడా కోల్పోయారు. అందరితో సౌమ్యంగా ఉన్నప్పటికీ ఆయనపై నియోజకవర్గ టీడీపీలో రెడ్డి సామాజికవర్గం నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది.

**చిచ్చుపెట్టిన చినబాబు**

2019 నుంచి పరసా వెంకటరత్నయ్య నియో జకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఉన్నట్టుండి టీడీపీ అధిష్టానం పరసాను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించి నెలవల సుబ్రమణ్యంకు అప్పగించింది. పార్టీలో లోకేష్ పెత్తనం పెరగడంతో కొత్త అభ్యర్థులను పెట్టాలనే ఉద్దేశంతో పరసాను పక్కన పెట్టేశారు. రాష్ట్ర విభజన ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్న నెలవల సుబ్రమణ్యం విభజన తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలో టికెట్ ఆశించి చేజేతులా వదులుకున్నారు. 2014 తరువాత టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తర్వాత అనతి కాలంలోనే రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. చివరకు అనూహ్యంగా ప్రస్తుతం ఆయన కుమార్తె విజయశ్రీకి టికెట్టు తెప్పించుకోగలిగారు. పార్టీని నమ్ముకుని 30 ఏళ్లు పనిచేస్తున్న పరసాకు ఝలక్ ఇచ్చి నెలవలకు బాధ్యతలను అప్పగించడంతోనే వీరిద్దరిమధ్య వివాదం ముదిరింది. దీనికి సంబంధించి పరసా కుమార్తె షాలిని కూడా ఇటీవల నాయుడుపేటలో ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబు, లోకేష్‌ను కడిగిపారేశారు. ఈ ప్రెస్‌మీట్ పరసాకు తెలిసే పెట్టారని నెలవల, ఆయన వర్గీయులు ఆయన మీద రుసరుసలాడారు. ఈ సారి బావబామ్మర్ది మధ్య నెలకొన్న కోల్డ్‌వార్ వైఎస్సార్‌సీపీ విజయానికి మరింత కలిసివస్తుందని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు.

# సంక్షేమం, అభివృద్ధికే పట్టం

- పోలింగ్ బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలి
- తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**తిరుపతి రూరల్:** సీఎం జగనన్న విజయం చరిత్రలో నిలిచేలా ప్రజలు తీర్పు ఉంటుందని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికే ఈ సారి ప్రజలు పట్టం కడుతారని ఆయన స్పష్టం చేశారు. గురువారం తుమ్మలగుంటలో చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పోలింగ్ బూత్ కమిటీల బలోపేతం, ప్రభుత్వ పథకాల పనితీరు, సీఎం జగనన్న అమలు చేసిన పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని తెలిపారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్య సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, వసతి దీవెనలతో పాటు నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఆసుపత్రుల ఆధునికీకరణతో పేద రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుకలిగిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం కల్పించారని వెల్లడించారు. సీఎం జగనన్న ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కమిటీల నియామకంపై ఆయన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



రాజధాని అమరావతి పేరుతో చంద్రబాబు అండ్ కో రెచ్చిపోయారు. ఉత్తుత్తి డిజైన్లు, భారీ గ్రాఫిక్స్‌లతో జనాన్ని బోల్తా కొట్టించారు. 'నా ఇటుక– నా అమరావతి' పేరుతో కొత్త వెబ్‌సైట్ ఓపెన్ చేసి చందాల వసూళ్లకు పాల్పడ్డారు. ఇందులో భాగంగానే ఇటుకల కోసం భారీగా వసూళ్లకు తెరలేపారు. బాబు గారడీని గుడ్డిగా నమ్మిన జనం భారీగా చందాలు సమర్పించేశారు. విరాళం ఇచ్చిన వారికి కేంద్ర ప్రభుత్వ రాయితీ ఉంటుందని నమ్మించి నట్టేట ముంచేశారు. తీరా ఆ నిధి ఏమైందో.. విరాళాల మొత్తం ఎక్కడుందో తెలియక జనాలు తలలు పట్టుకుంటున్నారు.

# మేడ కట్టనిధి!

- నా ఇటుక– నా అమరావతి పేరిట చందాల వసూలు
- విరాళాలిచ్చిన వారికి ఆన్‌లైన్‌లో రశీదులిస్తామని చెప్పిన వైనం
- రాజధాని నిర్మాణం పేరిట ఇదో స్కామ్ అంటున్న జనం

**పలమనేరు:** రాష్ట్ర విభజన తరువాత అమరావతిలో అద్భుతంగా సింగపూర్‌ను తలదన్నేలా కొత్త రాజధానిని నిర్మిస్తామని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. భారీ డిజైన్లతో కంప్యూటర్ల ద్వారా రాజధాని ఇలా ఉంటుంది, అలా ఉంటుందంటూ ప్రింట్‌లను తీసి భారీగా ప్రచారం చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తుత్తి డిజైన్లను చూసిన జనం గుడ్డిగా నమ్మారు. అయితే ఇదంతా బాబు అండ్ కో సాగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారమని అప్పట్లో తెలుసుకోలేకపోయారు. దీనికి తోడు రాజధాని నిర్మాణాలకు ప్రజలనుంచి ఎన్ఆర్ఐల దాకా 'నా ఇటుక– నా అమరావతి' పేరిట వెబ్‌సైట్‌ను తెరిచి కొత్త స్కామ్‌కు నాంది పలికారు. మన రాజధాని కదా అనే ప్రేమతో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎందరో చందాలకోసం నగదును ఆన్‌లైన్ ద్వారా లక్షలాది రూపాయలు విరాళంగా అందించారు. అయితే ఇటుకలు పోతేపోనీ ఆ డబ్బు ఏమైందన్న ప్రశ్న జనం నుంచి వినిపిస్తోంది.

**రాజధానికి ఆర్థిక సాయం పేరిట దోపిడీ**

అమరావతి రాజధాని నిర్మాణం పేరిట అప్పటి పాలకులు 2015 అక్టోబరు 15న 'నా ఇటుక– నా అమరావతి' పేరిట ఈ– ఇటుక (ఈ–బ్రిక్) కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ నిధిలో ఎవరైనా ఆర్థిక సాయం చేయచ్చునంటూ ప్రచారం చేశారు. ఒక్కో ఇటుక (రూ.10) నుంచి కోటి వరకూ ఆర్థిక సాయం చేయవచ్చని, దీన్ని రాజధాని నిర్మాణ నిధిలో ఉంచుతామంటూ ప్రకటనలిచ్చుకున్నారు. ఇందుకోసం జరిగే లావాదేవీలపై www.amaravathi.gov.in అనే వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇందులో నగదును మీసేవల ద్వారా, పోస్టాఫీసులు, మనీ ఆర్డర్, డీడీ, ఆన్‌లైన్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పంపాలని సూచించారు. నగదు పంపిన వారు అదే సైట్‌లో విరాళ రశీదులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా ఆదాయపు పన్ను మినహాయింపులుంటాయంటూ నమ్మబలికారు. చాలా మందికి ఇది వర్తించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు త్వరలోనే వచ్చేస్తాయంటూ నమ్మించారు. ఏదేమైనా ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది లక్షలాది రూపాయలను రాజధాని నిర్మాణానికి చెల్లించారు.

**ఇప్పుడు ఆ నిధి ఏమైనట్లో**

ఈ విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా ప్రపంచంలో ఉండే తెలుగువారినుంచి భారీగా విరాళాలను సేకరించారు. అయితే అప్పుడు చెల్లించిన విరాళాలు ఏమయ్యాయో, ఎక్కడికెళ్లాయో నాటి పాలకులకే తెలియాలంటున్నారు సాధారణ జనం. రాజధాని పేరిట గ్రాఫిక్స్ చూపెట్టి ప్రజలను మోసం చేసిందే కాకుండా జనం నుంచి ఈ– ఇటుకల పేరిట జరిగిన దోచుకున్న తీరును తలచుకొని ఇప్పటికీ శాపనార్థాలు పెడుతున్నారు.

**ఇటుకల డబ్బు ఏమైంది?**



"చంద్రబాబు చెప్పినట్టు అమరావతిలో భారీ భవనాలు లేవు. కనీసం టీకొట్లు, మంచి హోటల్ కూడా లేదు. అక్కడున్నవన్నీ తాత్కాలిక భవనాలే. రాజధానిలోకి వెళ్లేందుకు సరిగ్గా రోడ్డు కూడా లేదు. సింగపూర్‌ను మించిన రాజధాని అన్నారు. ఎలాగు వర్షానికి ఇటుకలు కరిగిపోయినా వసూలు చేసిన డబ్బు ఏమైందో చంద్రబాబు జనానికి చెప్పాలి.

– సుబ్రమణ్యం రెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

**ఆ విషయాన్ని అడిగేవారెవరు?**



ఈ ఇటుకకోసం నాటి పాలకులు సేకరించిన ప్రజాధనం ఏమైందో అడిగేవాళ్లెవరు. ఆ నిధికి ఎంత మొత్తం వచ్చింది. దాన్ని ఎక్కడ ఉంచారో చెప్పాల్సిన బాధ్యత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుదే. ఆయన మాట నమ్మి నాడు డబ్బులు కట్టిన వారంతా ఇప్పుడు బాధపడుతున్నారు. ఇప్పుడా వెబ్‌సైట్ ఓపెన్ కావడమే లేదంటున్నారు కొందరు. ఏం జరిగిందో ఆ పైవానికే తెలియాలి.

– సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం అధ్యక్షుడు

## ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు


వెంకటాపాళెంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎంపీ గురుమూర్తి

**ఏర్పేడు:** అధికారం కోసం ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే మాటలను నమ్మొద్దని, వాస్తవాలను తెలుసుకుని ఓటేయాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని చింతలపాళెం, వెంకటాపాళెం, నచ్చనేరి, నాగంపల్లి, ఏర్పేడు గ్రామాల్లో ఆయన కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే ప్రతిపక్షాలకు ప్రజలు గుర్తుకువస్తారని విమర్శించారు. తమకు ఓటు వేస్తే అదిచేస్తాం .. ఇది చేస్తామంటూ మాయ మాటలు చెప్పే ప్రయత్నం చేస్తారని, ప్రజలు ఏది నిజమో ఏది అబద్ధమో గ్రహించి తీర్పు ఇవ్వాలని సూచించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన అందించారని, మళ్లీ సీఎంగా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, సర్పంచ్‌లు సుబ్బమ్మ, మునిరామయ్య, పార్టీ నాయకులు పరమాల చంద్రశేఖర్, పెరుమాళ్, వేణు, గురునాథం, కేశవులురెడ్డి, కేశవులురెడ్డి, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

**తిరుపతి లీగల్:** ఆటోను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన కేసులో శెట్టిపల్లి పంచాయతీ, వినాయకనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సీ.ఆదెప్పాకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి అదనపు ప్రత్యేక కోర్టు గురువారం తీర్పు చెప్పింది. కోర్టు కానిస్టేబుల్ హేమంత్‌కుమార్ కథనం మేరకు... 2017 జూన్ 10వ తేదీ రేణిగుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జి గంగమ్మ ఆలయం వద్ద నిందితుడు ఆదెప్ప ఆటోను అతివేగంగా నడుపుతూ ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో రేణిగుంట మండలం, వేణుగోపాలపురానికి చెందిన వీ.పురుషోత్తం ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న బీ.వేణుగోపాల్ కింద పడ్డారు. వేణుగోపాల్ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు దర్యాప్తు చేసి డ్రైవర్ ఆదెప్పపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఆదెప్పకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## టీడీపీ నేత కారులో డిఫెన్స్ మద్యం స్వాధీనం


పోలీసులు సీజ్ చేసిన కారు

**చౌడేపల్లి:** తెలుగుదేశం పార్టీ నాయకుడు సోమల నగేష్‌కు చెందిన కారులో డిఫెన్స్ మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి మండలంలో వెలుగుచూసింది. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల మేరకు, పలమనేరు మార్గంలోని శెట్టిపేట కూడలిలో పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా సోమల నగేష్ ప్రయాణిస్తున్న కారులో డిఫెన్స్‌కు చెందిన మద్యం బాటిళ్లు గుర్తించామన్నారు. దానికి సంబంధించిన ఎలాంటి బిల్లులు లేకపోవడంతో కారును సీజ్ చేసి, వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## గిరిజన మత్స్యకారులపై టీడీపీ ప్రతాపం!

- సొసైటీ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్న చోటామోటా నాయకులు


చిల్లకూరు చెరువు

**చిల్లకూరు:** గిరిజన మత్స్యకార సొసైటీ సభ్యులపై టీడీపీ నాయకులు తమ ప్రతాపం చూపుతున్నారు. తమతో సంప్రదించకుండానే చెరువులో చేపలు ఎలా పట్టుకుంటారంటూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలు.. చిల్లకూరు గ్రామానికి చెందిన చెరువు కొన్ని సంవత్సరాలుగా గిరిజన మత్స్యకార సొసైటీగా మత్స్యశాఖలో కొనసాగుతూ వస్తోంది. అందులో కొత్త సభ్యులను చేర్చుకోవడం, ప్రభుత్వానికి రుసుములు చెల్లించుకోవడం లాంటివి చేస్తున్నారు. ఈ క్రమంలో గత ఆరు నెలల క్రితం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా సుమారు 1.50 లక్షల చేప పిల్లలును వదిలారు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా చెరువులో నీరు అడుగంటింది. ఉన్న చేపలను త్వరగా పట్టుకుని పంచుకునేందుకు సభ్యులు తీర్మానాలు చేసి పనులు మొదలుపెట్టారు. అయితే ఈ సారి ఆదాయం ఆశాజనకంగా ఉండడంతో పాటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సొసైటీ సభ్యులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు స్థానిక టీడీపీ నేతలు ఎత్తుగడలు వేసి వారిపై ఒత్తిడిని పెంచుతున్నారు. దీంతో సొసైటీ సభ్యులు తమ సొసైటీలో ఇతరుల జోక్యం తగదని తెగేసి చెబుతున్నారు. సొసైటీ సభ్యులు నివసించే శంకర గిరిజన కాలనీలో అధిక శాతం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండడంతో ఆ ప్రాంత మాజీ ప్రజాప్రతినిధితో పాటు గ్రామానికి చెందిన అగ్రవర్ణాల నాయకులు ఇలా కొత్త ఎత్తుగడలు వేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై మత్స్యశాఖాధికారి రఘుబాబును వివరణ కోరగా గిరిజన మత్స్యకార సొసైటీ విషయంలో ఇతరుల జోక్యం చేసుకోవడం తగదని తేల్చిచెప్పారు. సొసైటీలో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే జిల్లా అధికారుల ద్వారా విచారణ చేయిస్తామని స్పష్టం చేశారు.

## గడ్డివామి దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డివామి

**ఏర్పేడు:** మండలంలోని నచ్చనేరిలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కైలాసం మునిరెడ్డి ఎండు గడ్డి వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని వివిధ రైతుల నుంచి వెయ్యి మోపులు గడ్డిని కొనుగోలు చేసి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన పొలంలో వామి వేశాడు. గురువారం గడ్డివామి పైభాగాన ఉన్న విద్యుత్ తీగలు రాజుకుని షార్ట్‌సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు గడ్డివామిపై పడడంతో మంటలు చెలరేగాయి. సుమారు రూ.2 లక్షల విలువజేసే గడ్డి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

**చిల్లకూరు/ వాకాడు:** మండలంలోని కలవకొండ గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం.. గూడూరు మండలం, దివిపాళెంకు చెందిన వ్యక్తి మరో ఇద్దరితో కలసి ఇంటి నిర్మాణ పనులకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వచ్చే సమయంలో కలవకొండ వద్ద ముందు వెళుతున్న టిప్పర్‌ను అధిగమించబోయాడు. అదే సమయంలో ఎదురుగా మరో టిప్పర్‌ని ఢీకొట్టాడు. టిప్పర్ ముందు చక్రాలు అతని కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే వాకాడు మండలం, వడ్డిపాళెం, కోడివాగ మార్గంలో ధాన్యపు రాశిపై కప్పిన నల్ల పట్టను గమనించక ప్రమాదానికి గురికావడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.